సాక్షి రంగారెడ్డి
ఆదివారం । 10 । ఆగస్టు । 2025



మందుల్లేవ్!

కడ్తాల్‌తో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పశు పోషణ చేపడుతున్నారు. 8లో▸



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు రాఖీ కట్టిన అక్కలు ఉదయరాణి, శోభ, రేణుక, చెల్లెళ్లు వీణావాణి, ప్రియదర్శిని

న్యూస్‌రీల్

ఫ్లోరిడా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న అక్షర

చేవెళ్ల: అమెరికాలోని ఫ్లోరిడా యూనివర్సిటీ నుంచి వ్యవసాయ శాస్త్రంలో డాక్టరేట్ సాధించింది చేవెళ్ల మండలం జాలగూడ గ్రామానికి చెందిన అత్తెల్లి అక్షర. గ్రామానికి చెందిన అత్తెల్లి రవీందర్‌రెడ్డి, అనిత దంపతులు కుమార్తె అక్షర చేవెళ్లలోనే పదో తరగతి వరకు చదువుకుంది. ఇంటర్ హైదరాబాద్‌లో పూర్తి చేసి రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న పాలెం వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ చేసింది. మాస్టర్ చదివేందుకు అమెరికాలోని లూథియానా యూనివర్సిటీలో చేరింది. అక్కడ అగ్రికల్చర్ ఎమ్మెస్సీ పూర్తి చేసుకొని ఫ్లోరిడా యూనివర్సటీలో పీహెచ్‌డీలో చేరింది. వ్యవసాయ శాస్త్రంలో డాక్టరేట్ సాధించడంపై ఆమె కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆదివాసీల సంక్షేమానికి కృషి
డీటీడీఓ రామేశ్వరి దేవి



ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో డీటీడీఓ రామేశ్వరి దేవి తదితరులు

కడ్తాల్: ఆదివాసీ గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి (డీటీడీఓ) రామేశ్వరి దేవి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం మండల పరిధిలోని మైసిగండి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో పోరాట యోధుడు కొమురం భీం చిత్రపటానికి అధికారులు, ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గిరిజనుల జీవన విధానం ప్రత్యేకమైనదని, అడవి తల్లిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. అడవిబిడ్డల హక్కుల కోసం కొమురం భీం అహర్నిశలు పాటుపడ్డారని, వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనుభావుడని కొనియాడారు. గిరిజనులకే కాదు.. అన్ని జాతులకు ఆయన పోరాటం స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం పాపయ్య, హెచ్‌డబ్ల్యూఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనాలంటే 'చింత'



తుక్కుగూడ సంతలో విక్రయానికి చింతచిగురు

తుక్కుగూడ: చింత చిగురును ఇష్టపడని వారుండరు. ఏడాది కాలంలో జూలై నుంచి ఆగస్టు మాసం వరకు అధికంగా లభిస్తుంది. కొమ్మల చివరి ఉన్న చింత చిగురును కొయడానికి చాలా కష్టపడాల్సి వస్తుంది. ఎంతో రుచికరమైన చింత చిగురులో ఔషధ గుణాలు మెండుగా ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కిలో ధర రూ.1000 నుంచి రూ.1,200 వరకు విక్రయిస్తున్నారు. నానాటికి చింత చెట్ల సంఖ్య తగ్గిపోవడం, చిగురు కోసే వారు లేకపోవడంతో ధర పెరిగిపోతోంది.

అబుదాబిలో రోడ్డు ప్రమాదం: దంపతుల మృతి

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని సూరజ్ గార్డెన్ బస్తీకి చెందిన ఓ కుటుంబం అబుదాబిలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆ ప్రమాదంలో దంపతులు మరణించగా వారి కుమారుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పట్టణంలోని సూరజ్‌గార్డెన్ బస్తీకి చెందిన సయ్యద్ వాహిద్ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 7న ఉదయం కారులో ప్రయాణిస్తుండగా కారు అదుపు తప్పి ప్రమాదం చోటు చేసుకుంది. సయ్యద్ వాహిద్ సంఘటన స్థలంలోనే మృతిచెందగా అతడి భార్య ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయింది. నాలుగు నెలల బాలుడికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. 6, 8 సంవత్సరాల ఇద్దరు కుమార్తెలకు స్వల్పగాయాలయ్యాయి. దీంతో సూరజ్‌గార్డెన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. శనివారం సాయంత్రం మృతదేహాలు రాగా ఖననం పూర్తి చేశారు.

దోమలు కుట్టి.. జబ్బు పట్టి

విష జ్వరాల బారినపడుతున్న జనం



మహేశ్వరం మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో క్యూ కట్టిన బాధితులు

ఏకధాటి వర్షాలకు పారిశుద్ధ్యలోపం తోడవడంతో వ్యాధులు పంజా విసురుతున్నాయి. అనేక మంది కీళ్ల నొప్పులు, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. ఏ ఇంట్లోకి తొంగి చూసినా జ్వర పీడితులే దర్శన మిస్తున్నారు. సర్కారు దవాఖానాలు బాధితులతో కిటకిటలాడుతున్నాయి.

- చాపకింద నీరులా విస్తరిస్తున్న డెంగీ
- ఏకధాటి వర్షాలతో డయేరియా ముప్పు
- ఆస్పత్రులకు క్యూకడుతున్న జ్వరపీడితులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని 56 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోని ఓపీకి మే నెలలో 1,32,442 మంది బాధితులు రాగా, జూన్‌లో 1,34,725 మంది వచ్చారు. జూలైలో ఏకంగా 1,43,962 మందికి చేరుకున్నారు. ప్రతి నెలా పది వేల మంది కిపైగా విషజ్వరాల బారినపడుతున్నట్లు అంచనా. తాజాగా డెంగీ దోమలు సైతం పంజా విసురుతుండటంతో పల్లె వాసులే కాదు.. పట్టణ ప్రాంత ప్రజలు సైతం ఆందోళన చెందుతున్నారు. కొంత మంది వైద్యులు డెంగీ జ్వరాలను బూచీగా చూపి సాధారణ జ్వరపీడితులను ప్లేట్‌లెట్స్ కౌంట్స్, ఇతర చికిత్సల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 142 డెంగీ కేసులు నమోదు కాగా, హెచ్1ఎన్1(స్వైన్‌ఫ్లూ) కేసులు 14 నమోదు కావడం ఆందోళన కగిలిస్తోంది. కలుషిత నీరు, ఆహారంతో అనేక మంది వాంతులు, విరేచనాలు, విష జ్వరాల బారినపడుతున్నారు.

కునుకు లేకుండా చేస్తున్న దోమలు

తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, వాంతులు, చర్మంపై దద్దుర్ల వంటి లక్షణాలతో బాధపడుతూ ఆస్పత్రులకు చేరుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు 142 డెంగీ కేసులు నమోదు కాగా, వీటిలో జీహెచ్‌ఎంసీ పరిధిలో 77, శివారు మున్సిపాలిటీల్లో 53 ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 12 కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ భవనాలు, ధనవంతులు ఎక్కువగా నివసించే శేరిలింగంపల్లి పీహెచ్‌సీలో 41, నార్సింగి పీహెచ్‌సీలో 29, సరూర్‌నగర్‌లో 16, బాలాపూర్‌లో 11, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 11, మైలార్‌దేవ్‌పల్లిలో 8, చించోడులో ఏడు చొప్పున కేసులు నమోదవడం విశేషం. ఆకర్షణ, ఆహ్లాదం కోసం ఇంటి ముందు కుండీల్లో మనీప్లాంట్స్, ఖాళీ ప్రదేశంలో రకరకాల పూలు, పండ్ల మొక్కలు పెంచుతున్నారు. ఏకధాటి వర్షాలకు ఆయా కుండీలు, ఇంటిపై ఖాళీ డబ్బాలు, ఇంటి పక్క ఖాళీ స్థలాల్లో పడేస్తున్న కొబ్బరి బొండాలు, టైర్లలో నీరు చేరి దోమలకు నిలయంగా మారుతున్నాయి. ఇంటిపై ఉన్న నీటి ట్యాంకులపైనే కాదు సెల్లార్‌లో ఉన్న సంపులపై కూడా మూతలు లేకపోవడం, నిర్మాణాల కోసం తవ్విన సెల్లార్ గుంతల్లో నీరు చేరడం, స్లాబులు, గోడల క్యూరింగ్ కోసం వాడిన నీరు రోజుల తరబడి నిల్వ ఉంటూ దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయకపోవడంతో ఇవి మరింత వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

> **అప్రమత్తం చేశాం**
>
> కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఏఎన్‌ఎంలు, ఆశాలు ఆయా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పర్యటించారు. ప్రజారోగ్యానికి హానికరంగా మారిన హైరిస్క్‌జోన్లను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య మెరుగు కోసం చర్యలకు సిఫార్సు చేశాం. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. అన్ని ఆస్పత్రుల్లో అవసరమైన మందులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచుతున్నాం. అన్నిరకాల పరీక్షలతో పాటు మందులను ఉచితంగా అందజేస్తున్నాం. రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.
>
> – డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి

జిల్లాలో నమోదైన సీజనల్ వ్యాధులు

మాసం	ఫీవర్	డయేరియా	రక్తవిరేచనాలు	స్వైన్‌ఫ్లూ	డెంగీ
జనవరి	11,215	98	119	03	09
ఫిబ్రవరి	10,891	111	114	03	02
మార్చి	11,511	117	143	01	02
ఏప్రిల్	11,025	79	86	01	04
మే	10,718	58	138	–	18
జూన్	10,202	77	119	–	45
జూలై	10,778	78	109	05	53
ఆగస్టు (7వరకు)	1,752	08	19	01	09

రాఖీ కట్టి.. అనుబంధాన్ని చాటి

ఆత్మీయ అనుబంధాలకు ప్రతీకగా నిలిచే రాఖీ వేడుకలను శనివారం జిల్లావాసులు ఘనంగా జరుపుకొన్నారు. ఆడపడుచులు అన్నాతమ్ముళ్లకు ఆప్యాయంగా రాఖీలు కట్టారు. రాఖీ, మిఠాయి దుకాణాలు కొనుగోళ్లతో కిటకిటలాడాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు కిక్కిరిసిపోయాయి. రహదారులపై రద్దీ నెలకొంది. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది.



ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి రాఖీ కడుతున్న మేనకోడలు



షాద్‌నగర్: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు రాఖీ కడుతున్న చెల్లెలు

పెళ్లిలో తమ్ముడికి రాఖీ కట్టిన అక్క



పెళ్లి వేడుకలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

మొయినాబాద్: అన్నా చెల్లెలు, అక్కా తమ్ముల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్. సోదరులు ఎక్కడున్నా అక్కాచెల్లెళ్లు అక్కడికి వెళ్లి రాఖీ కట్టి తమ అనుబంధాన్ని చాటుకుంటారు. పెళ్లి వేడుకలోనే వరుడు (తమ్ముడు)కి రాఖీ కట్టి రక్షాబంధన్ విశిష్టతను చాటిచెప్పింది ఓ సోదరి. గతంలో మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ప్రస్తుతం ఏసీబీ నిజామాబాద్ డీఎస్పీగా పనిచేస్తున్న శేఖర్‌గౌడ్ కూతురు నిషిత, కేశంపేటకు చెందిన అన్వేష్‌రెడ్డి వివాహ వేడుక శనివారం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని స్టార్ కన్వెన్షన్‌లో జరిగింది. పెళ్లి వేడుకలోనే అన్వేష్‌రెడ్డికి అక్క మౌనిక రాఖీ కట్టి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఏసీబీ డీజీ విజయ్ కుమార్, ఐపీఎస్ అధికారి కోటిరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఎల్లలు దాటి వచ్చి..

మొయినాబాద్: తమ్ముడికి రాఖీ కట్టేందుకు అక్క ఎల్లలు దాటి వచ్చింది. జర్మనీ నుంచి వచ్చి మొయినాబాద్‌లో ఉండే తమ్ముడికి రాఖీ కట్టింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం వెలిమల గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి, వీణా దంపతులు పదేళ్ల క్రితం జర్మనీ వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. వారి కూతురు ధృవి తన పిన్ని కొడుకు శ్రేయస్‌రెడ్డికి రాఖీ కట్టేందుకు మూడు రోజుల క్రితం హైదరాబాద్ వచ్చింది. శనివారం రాఖీపౌర్ణమి సందర్భంగా మొయినాబాద్‌లో ఉండే పిన్నివాళ్ల ఇంటికి వచ్చి శ్రేయస్‌రెడ్డికి రాఖీ కట్టింది.



సోదరుడికి రాఖీ కడుతున్న అక్క

హెల్మెట్ ధరించని వాహనదారులకు..



హెల్మెట్ లేకుండా వెళ్తున్న వాహనదారులకు రాఖీలు కడుతున్న మహిళా పోలీసులు

- పోలీసుల ప్రత్యేక కౌన్సెలింగ్

పహాడీషరీఫ్: రాఖీ పౌర్ణమి సందర్భంగా సొంతూళ్లకు వెళ్తున్న వాహనదారులకు బాలాపూర్ పోలీసులు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి రాఖీలు కట్టారు. హెల్మెట్ ధరించకుండా పుట్టింటికి భర్తలతో వెళ్తున్న వాహనాలను గుర్తించి హెల్మెట్ ధరించాలని, ఏదైనా ప్రమాదం జరిగితే వచ్చే ఏడాది రాఖీలు కట్టలేకపోతారని అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో రాఖీ శుభాకాంక్షలు తెలిపి మరీ మహిళా పోలీస్ అధికారులతో రాఖీలు కట్టించారు.

ఆర్టీసీ.. ఫుల్ గి'రాఖీ'

- వేడుక వేళ ప్రయాణికుల రద్దీ
- ఇదే అదనుగా అదనపు బాదుడు

షాద్‌నగర్: రాఖీ వేడుక వేళ ఆర్టీసీ బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. శనివారం పండుగ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బస్సుల్లో ప్రయాణించారు. ఫలితంగా షాద్‌నగర్ బస్టాండ్ ప్రయాణికులతో నిండిపోయింది. షాద్‌నగర్ నుంచి మహబూబ్‌నగర్, హైదరాబాద్, పరిగి తదితర ప్రాంతాల వైపు రద్దీ ఎక్కువగా కనిపించింది. ఈ మేరకు అధికారులు బస్సుల సంఖ్య పెంచినప్పటికీ ఏది చూసినా కిటకిటలాడుతూ వెళ్లడం కనిపించింది. గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా, పండుగ వేళ అదనపుచార్జీలు వసూలు చేశారు. షాద్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు మామూలుగా అయితే రూ.80 చార్జీ ఉండగా, రూ.110 వసూలు చేశారని ప్రయాణికులు పేర్కొన్నారు.



షాద్‌నగర్ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

పూల ధరలకు రెక్కలు

శ్రావణమాసం, పెళ్లిళ్ల సీజన్ కావడంతో..

- రకాలను బట్టి రూ.200 నుంచి రూ.2,500 వరకు..

నవాబుపేట: ఓవైపు శ్రావణమాసం పూజలు.. మరో వైపు పెళ్లిళ్ల సీజన్ కావడంతో పూల ధరలకు రెక్కలు వచ్చాయి. ఈ నెల పవిత్ర మాసం కావడంతో పూల వినియోగం భారీగా ఉంది. మహిళలు అమ్మవారిని వివిధ రకాల పూలతో కొలుస్తుంటారు. గత శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నాటి నుంచి పూల రేట్లు మరింత పెరిగాయి. పెళ్లి వేదికను పూలతో అలంకరించడానికి సుమారు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఆర్థికంగా ఉన్నవారు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. వధూవరులు మెడలో ధరించే పూలమాల ధర రూ.2 వేలకు పైగా ధర పలుకుతోంది. సాధారణ రోజులు ఒక మాల రూ.200 నుంచి రూ.500 వరకే ఉంటుంది. ఇక బంతి, చామంతి, మల్లె పూల దండలైతే రూ.1000 పైనే. లిల్లీ పూల దండకూడా భారీ ధర పలుకుతోంది. వారం రోజుల క్రితం మూర పూలు రూ.20కు ఇచ్చే వారు.. ప్రస్తుతం రూ.50 తీసుకుంటున్నారు. కిలో బంతి పూలు రూ.120 నుంచి రూ.150 పలుకుతున్నాయి. చామంతి కిలోకి రూ.300 నుంచి రూ.500 వరకు.. లిల్లీ పూలు కిలోకి రూ.600 నుంచి రూ.800 వరకు, కనకాంబరాలు కిలోకి రూ.2వేల నుంచి రూ.2,500 వరకు, గులాబీ కిలో రూ. 250 నుంచి రూ.400 వరకు ధర పలుకుతున్నాయి. ధరలు విపరీతంగా పెరగడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు.



హైటెక్స్‌లో ఆగస్టు ఫెస్ట్

మాదాపూర్: ఆగస్టు ఫెస్ట్ వంటి వేదికలు రాష్ట్రం, దేశంలో సాంకేతికత ఆధారిత వృద్ధి భవిష్యత్‌ను రూపొందించడంలో కీలకమైనవని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శనివారం ఆగస్టు ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2035 నాటికి రాష్ట్ర జీడీపీ 1 ట్రిలియన్‌కు, 2047 నాటికి 3 ట్రిలియన్‌లకు, జాతీయ జీడీపీని 5 నుంచి 10 శాతం పెంపు లక్ష్యంగా తెలంగాణ రైజింగ్–2047 విజన్ పాలసీ అని తెలిపారు. సినీ సంగీత దర్శకుడు రమణ గోగుల మాట్లాడుతూ.. కృత్రిమ మేధతోనే మనుగడ అని పనిని మెరుగుపర్చుకోవడానికి అది ఒక సాధనమన్నారు. గ్రామీణ విద్యార్థి ఆవిష్కర్తగా వేరుశనగ పొట్టు ఉపయోగించి పర్యావరణ అనుకూలమైన వినాయకుడి విగ్రహాలు, బయో పూల తొట్లు, గ్లాసులు, ప్లేట్లు తదితరాల తయారీని కొనియాడారు. మెకానికల్ ఇంజినీర్ నుంచి ఆవిష్కర్తగా మారిన దీపక్‌రెడ్డి రైతులు బంజరు భూముల నుంచి రాళ్లను తొలగించడంలో సహాయపడడానికి ఒక పరికరాన్ని ఆవిష్కరించారు. బహుళ దశలు, హ్యాండ్స్ ఆన్ వర్క్ షాప్‌లు, స్టార్టప్ షోకేస్‌లు, సృజనాత్మక ఇన్‌స్టాలేషన్స్, వ్యవస్థాపకులు, టెక్ ఔత్సాహికులు ఫెస్ట్‌లు పాల్గొన్నారు.

గిరిజన తెగల్లో నేటికీ ఆకలి చావులు



జాన్‌వెస్లీకి రాఖీ కడుతున్న మహిళ

- రాజ్యాంగ ఫలాలు వారికి దక్కడం లేదు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది నిర్లక్ష్య వైఖరి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

యాచారం: గిరిజన, ఆదివాసీ తెగల్లో నేటికీ ఆకలి చావులు తప్పడం లేదని.. స్వయంగా ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మార్పు రావడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ, గిరిజన హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఆదివాసీ, గిరిజన తెగల్లో ఏ విధమైన మార్పు రావడం లేదని, రాజ్యాంగ ఫలాలు వారికి దక్కడం లేదని అన్నారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లు కల్పించే విషయంలో ఘోరంగా విఫలమవుతున్నాయని దుయ్యబట్టారు. నేటికీ అటవీ భూములను నమ్ముకుని జీవనోపాధి పొందుతుంటే వాటని ఆక్రమిస్తూ మనోవేదనకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతంలో ప్రాజెక్టులు, ఖనిజం తవ్వకాల పేరుతో బలవంత తరలింపు జరుగుతోందన్నారు. ఇప్పటికీ తండాల్లో రోడ్డు మార్గం, విద్యుత్, తాగునీటి సౌకర్యాం లేక దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు గుప్పిస్తూ గెలుపొందిన తర్వాత విస్మరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ, గిరిజన తండాల్లో పర్యటించి వారి సమస్యలపై పోరాటానికి సిద్ధమవుతామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ కంట్రోల్ కమిటీ చైర్మన్ డీజీ నర్సింహరావు, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ జీపీ కార్మికుడి మృతి


శ్రీనయ్య (ఫైల్)

కేశంపేట: చికిత్స పొందుతూ జీపీ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని భైర్కాన్‌పల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గాదెకాడి శ్రీనయ్య (42) పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. భార్య, ముగ్గురు ఆడపిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన శ్రీనయ్య తాగేందుకు డబ్బులు కావాలని తరచూ భార్య తో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 7న రాత్రి తాగి ఇంటికి వచ్చాడు. ఇంకా మద్య ం తాగేందుకు డబ్బులు కావాలని భార్యను అడగడంతో ఆమె లేవని తెలిపింది. దీంతో అదే రాత్రి ఇంట్లో ఉన్న కలుపుమందు తాగా డు. గమనించిన కుటుంబ సభ్యులు షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్, స్కూటీ ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

దుద్యాల్: టిప్పర్ – స్కూటీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని రోటిబండ తండా సమీపంలో లగచర్ల గేటు వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా గుండుమల్ మండలం గండిహనుమాన్(దామ్లా) తండాకు చెందిన హన్మంతు హైదరాబాద్ నుంచి సొంత గ్రామానికి స్కూటీపై వస్తున్న క్రమంలో లగచర్ల గేటు వద్ద హకీంపేట్ నుంచి ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో హన్మంతు తలకు తీవ్ర గాయమైంది. మహబూబ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కిటకిటలాడిన నృసింహుడి సన్నిధి

ఇబ్రహీంపట్నం: శ్రావణ మాసం, రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం ఇబ్రహీంపట్నం శ్రీ లక్ష్మీనృసింహస్వామి అలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. గుట్టపై సత్యనారాయణ స్వామి వ్రతం చేయించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


స్వామివారి సన్నిధిలో భక్తజనం


చంద్రమౌళిని సన్మానించిన పద్మశాలి సంఘం నాయకులు

అవార్డు గ్రహీతకు సన్మానం

మాడ్గుల: నూలు పౌర్ణమిని పురస్కరించుకొని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక గాయత్రీ ధారణ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ కళాకారుడు, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు గ్రహీత గుర్రం చంద్రమౌళిని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు వినోద్, విష్ణు, రమేష్, యాదగిరి, వెంకటేశ్వర్లు, శివ, రాములు, రాజు, గోషిక, నరేష్ తదితరలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం


త్రిపాఠి(ఫైల్)

గచ్చిబౌలి: అదుపు తప్పి కారు పల్టీ కొట్టడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం పాలైన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన మేరకు.. చత్తీస్‌ఘడ్ రాయపూర్‌కు చెందిన రూపక్ త్రిపాఠి(30) మాదాపూర్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. కేపీహెచ్‌బీలో తమ్ముడు శాశ్వత్ త్రిపాఠితో కలిసి నివాసం ఉంటున్నారు. స్నేహితులతో కలిసి ఎర్టిగా కారులో కేపీహెచ్‌బీ నుంచి నాలెడ్జ్ సిటీకి వెళుతుండా టీ హబ్ రోడ్డులో శనివారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. నాలుగు పల్టీలు కొట్టడంతో బెలూన్ తెరుచుకున్నప్పటికీ డ్రైవింగ్ చేస్తున్న రూపక్ త్రిపాఠి తలకు తీవ్ర గాయాలయ్యాయి. మాదాపూర్‌లోని మెడికొవర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందాడు. కారులో ఉన్న సోదరునితో పాటు స్నేహితులు వైభవ్ పాటిల్, ఇషాన్ త్రిపాఠి, ఎస్ రాజ్ సింగ్‌లు క్షేమంగా బయటపడ్డారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే ఇటీవల రూపక్ త్రిపాఠి మొబైల్ యాప్‌ను డెవలప్ చేశాడు. యాప్‌ను లాంచ్ చేయాల్సి ఉందని చెప్పి చత్తీస్‌ఘడ్ నుంచి వారం రోజుల క్రితం ముగ్గురు స్నేహితులను పిలిపించుకున్నాడు. తెల్లవారు జామున ఐటీ కారిడార్ చూసేందుకు వెళుతూ కారు అదుపుతప్పడంతో రూపక్ త్రిపాఠి తిరిగి రాని లోకాలు వెళ్లాడు.కారు ముందు చక్రం ఊడిపోయి నుజ్జునుజ్జు అయ్యింది. పోలీసులు మృత దేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ఆమనగల్లులో సోదరులతో సోదరీమణులు


కడ్తాల్‌లో.. సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డికి రాఖీ కడుతున్న సోదరి దీపికా రెడ్డి

సెల్ఫీ విత్ రాఖీ

అక్కాచెల్లెళ్ల ఆత్మీయ వేడుక రక్షాబంధన్ శనివారం ఘనంగా జరిగింది. పర్వదినాన్ని పురస్కరించుకొని సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టారు. తోచిన కానుకలు అందజేసి అన్నదమ్ములు తోబుట్టువుల ఆశీర్వాదం తీసుకున్నారు. రాఖీ పౌర్ణమి వేడుకను మరింత ప్రత్యేకంగా చూపించాలనే ఉద్దేశంతో 'సాక్షి' 'సెల్ఫీ విత్ రాఖీ' పేరుతో ఫొటోలను ఆహ్వానించగా.. మంచి స్పందన లభించింది. పల్లెలు, పట్టణాల నుంచి ఆడపడుచులు అన్నదమ్ములకు రాఖీలు కడుతున్న చిత్రాలను పంచుకున్నారు.


తాండూరులో..


సరూర్‌నగర్‌లో..


మహేశ్వరంలో..


ధారూరులో..


బషీరాబాద్ వసతిగృహంలో సోదరులకు రాఖీ కడుతున్న ఆడపడుచు


కడ్తాల్‌లో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ నివాసంలో..

చెల్లెలిని చూసేందుకు వెళ్తూ..


శివకృష్ణ (ఫైల్)

కడ్తాల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలివీ.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు గ్రామానికి చెందిన కొమ్మరి శివకృష్ణ (24) కొంత కాలంగా హైదరాబాద్‌లో టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో ఉండే చెల్లెలు స్వప్న క్రిమిసంహారక మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతుందనే సమాచారం మేరకు శుక్రవారం తెల్లవారుజామున నగరం నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో మండల కేంద్రం సమీపానికి చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శివకృష్ణను చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికత్స పొందుతూ అతను మృతి చెందాడు. శనివారం మృతుడి తల్లి సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉధృతంగా 'కాగ్నా'

బొంకూర్‌కు ఆగిన రాకపోకలు

తాండూరు రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని బిజ్వార్ – బొంకూర్ గ్రామాల మధ్య కాగ్నా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో బొంకూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ గ్రామ ప్రజలు పెద్దేముల్ మండలం రుక్మాపూర్ మీదగా తాండూరుకు వెళ్తున్నారు. బిజ్వార్ గ్రామానికి వచ్చిన ఓ వ్యక్తి బొంకూరు వెళ్లేందుకు ప్రమాదకర వాగులో ఈత కొడుతూ అవతలి ఒడ్డునకు చేరాడు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గ్రామాన్ని సందర్శించారు. బొంకూర్ బ్రిడ్జి పనులను సత్వరం పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు.

మందుల్లేవ్!

వెటర్నరీ ఆస్పత్రుల్లో మెడిసిన్ సమస్య

- పది నెలలుగా ప్రభుత్వం నుంచి నిలిచిపోయిన సరఫరా
- గత్యంతరం లేక ప్రైవేటులో తేవాలంటున్న వైద్యులు, సిబ్బంది
- సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- ఆందోళనలో రైతులు, పశుపోషకులు


గొర్రెలకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి (ఫైల్)

కడ్తాల్: కడ్తాల్‌తో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పశు పోషణ చేపడుతున్నారు. ముప్పై, నలభై ఏళ్లుగా పాడి పరిశ్రమతో ఉపాధి పొందుతున్నారు. పశు సంపద అదనపు ఆదాయ వనరు కావడంతో, సాగు భూమిలోని కొంత విస్తీర్ణంలో గడ్డి పెంచడం వీరికి అలవాటుగా మారింది. సొంత భూమి లేనివారు సైతం ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం ద్వారా ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా వీటికి ఏవైనా వ్యాధులు సోకితే సరైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ పశు వైద్యశాలల్లో మందులు లేకపోవడం చికిత్సలకు ఇబ్బందిగా మారుతోంది. వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పశు సంపద భారీగా ఉండటంతో వెటర్నరీ హాస్పిటాళ్లకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో మందుల కొరత పెద్ద సమస్యగా మారింది. తప్పని పరిస్థితుల్లో గత్యంతరం లేక, ఆర్థికంగా భారమైన ప్రైవేటుగా మందులు కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పశువులకు సోకే వ్యాధులు

పశువులకు కాలన్ని బట్టి వచ్చే వ్యాధులతో పాటు, సాధారణ వ్యాధులు సోకుతాయి. ప్రస్తుతం వర్షకాలం కావడంతో వీటి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సాధారణ జ్వరం, పారుడు రోగం, చర్మ వ్యాధులు, గొంతు వాపు, జబ్బవాపు, గాలికుంటు, గురక, మసూచి, జీర్ణ సంబంధ వ్యాధులు, నోట్లో పుండ్లు పడుతుంటాయి.

నిలిచిన మందుల సరఫరా

పశు సంవర్ధక శాఖ అధికారులు ఏడాదికి నాలుగు విడతల్లో వెటర్నరీ ఆస్పత్రులకు మందులు సరఫరా చేస్తుంది. మండల పరిధిలోని పశు సంపద ఆధారంగా వీటిని పంపిణీ ఉంటుంది. కానీ గతేడాది అక్టోబర్ నుంచి మందుల సరఫరా పూర్తి స్థాయిలో నిలిచిపోయింది. దీంతో మూగజీవాలకు రోగా లొస్తే మందులు అందుబాటులో ఉండటం లేదు.

అవగాహన అంతంతే..

పశువులకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించేందుకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. సీజనల్ వ్యాక్సిన్లు వేసే సమయంలో రైతులకు ఒకటి, రెండు మాటలు చెప్పి మమ అనిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా వ్యాధులపై సరైన అవగాహన లేక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి.

సబ్ సెంటర్లు తక్కువే..

మండలంలో 24 జీపీలు ఉండగా, కడ్తాల్‌లో పశు వైద్య కేంద్రం ఉంది. మండల పరిధిలోని 5 గ్రామాల్లో సబ్ సెంటర్లు ఉన్నాయి. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌తో పాటు, ఎల్ఎస్ఏ, జేవీఓలు ముగ్గురు, అఫీస్ సబార్డినేట్లు నలుగురు విధులు నిర్వర్తిస్తున్నారు. వెటర్నరీ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ముద్వీన్, చల్లంపల్లి గ్రామాల్లో సరిపడా సిబ్బంది ఉండగా, రావిచేడ్‌లో సబార్డినేట్ పోస్ట్ ఖాళీగానే ఉంది. అన్మాస్‌పల్లిలో పశువైద్య ఉప కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుని, సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ముద్వీన్, కర్కల్ పహాడ్ గ్రామాల్లో భవనాలు లేవు. పూర్తి స్థాయి సేవలు అందాలంటే పంచాయతీకి ఒకటి చొప్పున సబ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు అందుబాటులో ఉండటం లేదు. ఇదే అదనుగా భావిస్తున్న ప్రైవేటు మెడికల్ షాపుల యజమానులు వారికి నచ్చిన ధరలకు విక్రయిస్తున్నారు.

మండలంలో పశు సంపద	
ఆవులు	17,314
గేదెలు	2,017
గొర్రెలు	16,643
మేకలు	7,868
కోళ్లు	7,98,491
కుక్కలు	1.561
పందులు	1,127

ప్రభుత్వం దృష్టిసారించాలి



పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేయాలి. ప్రస్తుతం పశు పోషణ తలకు మించిన భారంగా మారింది. ప్రభుత్వ పశువైద్య కేంద్రంలో మందులు కూడా దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రైవేట్‌లో కొనుగోలు చేయడం భారంగా మారింది. – కదారి రామకృష్ణ, పశు పోషకుడు, కడ్తాల్

ఇండెంట్ పెట్టాం



పశువులకు అవసరమైన మందులు ప్రస్తుతం పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. ఇటీవలే ఇండెంట్ పెట్టాం. త్వరలోనే మందులు సరఫరా అవుతాయి. మూగజీవాలకు వ్యాక్సిన్లు వేస్తున్నాం. రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. – డాక్టర్ భానునాయక్, మండల పశువైద్యాధికారి